మాల మహానాడు సదస్సుకు తరలిరావాలి

కాచిగూడ: వర్గీకరణకు అనుకూలంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మాలలకు తీరని ద్రోహం చేస్తున్నారని.. కాంగ్రెస్ విష కౌగిలి నుంచి మాల జాతిని కాపాడుకోకపోతే భవిష్యత్ లేదని.. బానిసత్వం తప్పదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్ రాజు అన్నారు. శుక్రవారం నారాయణగూడలోని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాల మహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర సదస్సుకు మాలలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు ప్రముఖ న్యాయవాది ఎ.వెంకటరావు, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. తెలంగాణలో మాల జాతి భవిష్యత్ కోసం జరిగే పోరాట కార్యాచరణను ఈ సదస్సులో చర్చించి ప్రకటిస్తామన్నారు.

మంచినీటి బిల్లుల చెల్లింపు గడువును పొడిగించాలి

కాచిగూడ: గ్రేటర్ పరిధిలో మంచినీటి బిల్లుల చెల్లింపు కోసం పేద, మధ్య తరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతం రావు కోరారు. శుక్రవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని బీజేపీ నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. మంచినీటి బిల్లుల చెల్లింపుకు ఈ నెల 30వ తేదీ గడువు విధించారని, బిల్లులు చెల్లించని వారి కనెక్షన్లను తొలగిస్తామని ప్రజలపై ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. దీని వల్ల ప్రజలు తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బిల్లుల చెల్లింపు గడువును పెంచడంతో పాటు వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వై.అమృత, శ్యామ్‌రాజ్, పవన్‌కుమార్, నర్సింగ్‌రావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విజ్ఞానాన్ని పంచే భాండాగారాలు గ్రంథాలయాలని అంబేడ్కర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ కళాశాలలో 57వ అంతర్జాతీయ గ్రంథాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టా శేఖర్ మాట్లాడుతూ... నిరంతరం విద్యార్థులు గ్రంథాలయాలలో ఉన్న పుస్తకాలను చదివి, తమ జ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉండే లైబ్రరీలను సద్వినియోగం చేసుకున్నప్పుడే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. సివిల్స్, ఇతర గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు గ్రంథాలయాలు దోహద పడుతాయన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయ అధికారి కిరణ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లాజిస్టిక్స్ కౌంటర్ ప్రారంభం

నల్లకుంట: నల్లకుంటలో టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ నూతన కౌంటర్‌ను నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఎదురుగా శుక్రవారం ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం మధుసూదన్, ఏటీఎం లాజిస్టిక్స్(కార్గో) వెంకటనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లాజిస్టిక్స్ సేవలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. దీని ద్వారా హోం డెలివరీ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సెంటర్ల ద్వారా హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు కూడా సురక్షితంగా హోం డెలివరీ సేవలు అందిస్తున్నామని చెప్పారు. నల్లకుంట పరిసర ప్రాంత ప్రజలు నూతనంగా ప్రారంభించిన లాజిస్టిక్స్ కౌంటర్ ద్వారా అందుబాటులోకి వచ్చిన కొరియర్, కార్గో, పార్సిల్ సేవలను సద్వినియోగ చేసుకోవాలని కోరారు. ఈ కౌంటర్ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ జి.శ్రీకాంత్, మార్కెటింగ్ సిబ్బంది సతీష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు

కాచిగూడ: పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించే విధంగా ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కేసులు బుక్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడ స్టేషన్ రోడ్డు, నింబోలిఅడ్డ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు, రోడ్ల ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ ట్రాఫిక్ ఏఎస్‌ఐ అనిల్‌గౌడ్, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి దిశగా ఎదుగాలి

చిక్కడపల్లి: మహిళలు స్వయం ఉపాధి దిశగా ఎదుగాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. చిక్కడపల్లి బాపునగర్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, హైదరాబాద్ మహానగర పాలక సంస్థ వారి ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయనతో పాటు గాంధీనగర్ కార్పొరేటర్ పావని హాజరై క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ ఖాదర్ మొహియుద్దీన్, డీపీఓ సుధాకర్‌రావు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బాపునగర్ సంస్థ అధ్యక్షురాలు శారద, కార్యదర్శి డి.లావణ్య, నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో విప్లవోద్యమాలను ఆపలేరు

ముషీరాబాద్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, అజ్ఞాత దళ కమాండర్ పూనెం రమేష్‌ను గురువారం సాయంత్రం ఇల్లెందు మండలం ఎల్లాపురం సమీపంలో అరెస్టు చేసినట్లు రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్‌రావు తెలుస్తోందని అన్నారు. ఆయన ఆదివాసీ, పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న విప్లవ నాయకుడన్నారు. ఈ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయం కోసం ఆయన పోరాడుతున్నారని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రమేష్‌ను అరెస్టు చేయడం అక్రమమన్నారు. ఆయన ప్రాణానికి ఎలాంటి హాని తలపెట్టకుండా పోలీసులు వెంటనే కోర్టుకు హాజరుపరచాలని అన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో విప్లవోద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



కవాడిగూడ: దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ కేసును దోమలగూడ ఎస్సై నిరంజన్ కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఘనంగా దీక్షా దివస్ వేడుకలు



రాంనగర్ చౌరస్తాలోని కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ: ప్రత్యేక తెలంగాణ సాధనకోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షనే తెలంగాణ రాష్ట సాధనకు దోహదం అయ్యిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇందిరాపార్కు చౌరస్తాలో బీఆర్ఎస్ నగర సీనియర్ నాయకులు కల్వగోపి ఏర్పాటు చేసిన దీక్షా దివస్ కార్యక్రమానికి వి. శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'తెలంగాణ తెచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో..' అనే నినాదంతో కేసీఆర్ చేపట్టిన దీక్షనే ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు ప్రాణం పోసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు రేషం మల్లేష్, నాయకులు నేత శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, సిరిగిరి కిరణ్, కార్తీక్‌యాదవ్, విఠల్‌రావు, శివ, మధు, వెంకటేష్, రాజేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కేసీఆర్ ఆమరణ దీక్షతోనే తెలంగాణ ఆవిర్భావం**

ముషీరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి చేపట్టిన ఆమరణ దీక్ష ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దీక్ష దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం రాంనగర్ చౌరస్తాలోని అమరవీరుల స్తూపానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ భవన్‌కు బైక్‌లపై ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... ''కేసీఆర్ చచ్చుడో... తెలంగాణ వచ్చుడో..''అనే నినాదంతో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తెలంగాణ సమాజాన్ని ఏకతాటిపైకి తెవడం మూలంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, వి.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వై.శ్రీనివాస్, రాకేష్, శ్రీధర్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, శ్యామ్ యాదవ్, వి.సుధాకర్‌గుప్తా, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **రెడ్ బిల్డింగ్ చౌరస్తాలో...**

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేతలు దీక్షా దివస్ నిర్వహించారు. బాగ్ అంబర్‌పేటలో రెడ్ బిల్డింగ్ చౌరస్తాలో చేపట్టిన కార్యక్రమానికి కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి హాజరై కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు బి.వెంకట్‌రెడ్డి, చంద్రమోహన్, శ్రీరాములు ముదిరాజ్, ఆఫ్రోజ్ పటేల్, అరుణ్‌కుమార్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: ప్రాణాలు పణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ అని బీఆర్ఎస్ యువ నేత ముఠా జైసింహ అన్నారు. బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ దీక్ష దివస్‌కు గాంధీనగర్ డివిజన్ నుంచి పెద్ద ఎత్తున శుక్రవారం ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముఠా నరేష్, బీఎస్ శ్రీనివాస్‌యాదవ్, పున్న సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీనివాస్‌గుప్తా, ఆకుల శ్రీనివాస్, శ్రీకాంత్, పాశం రవి తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్ డివిజన్ నుంచి దీక్షా దివస్‌కు బైక్ ర్యాలీగా వెళ్తున్న ముఠా జైసింహ, నాయకులు



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



రెడ్ బిల్డింగ్ చౌరస్తాలో దీక్షా దివస్‌లో బాగ్ అంబర్‌పేట కార్పోరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి

పోలీస్ కిష్టయ్యను తొలి అమరుడిగా ప్రకటించాలి

- తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్
- కిష్టయ్య జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలి
- తెలంగాణ వ్యాప్తంగా పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతి

కాచిగూడ: తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ 15వ వర్ధంతి సభలను రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 1న నిర్వహించాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణగూడలోని మహాసభ రాష్ట్ర కార్యలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనాటి ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడకుండా అడ్డుకునేందుకు చేసిన కుట్రలను సహించలేక కిష్టయ్య తనప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. అలాంటి త్యాగధనులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ కిష్టయ్యను తొలి అమరుడిగా ప్రకటించి ప్రభుత్వమే ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని ఏదైనా యూనివర్సిటీకి పోలీస్ కిష్టయ్య పేరు పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ గన్‌పార్క్‌లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద వర్ధంతిని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. సమావేవంలో మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శులు శివయ్య ముదిరాజ్, మద్దెల సంతోష్, పగిడాల సుధాకర్, గౌడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్ ముదిరాజ్

ముట్టడికి తరలిన బీజేపీ నేతల అరెస్ట్

అంబర్‌పేట: గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ నాయకులు చేపట్టిన ఆందోళనను పోలీసులు అడ్డుకున్నారు. శుక్రవారం మాసాబ్‌ట్యాంక్ భవన్ ముట్టడికి తరలివెళ్తున్న ఎస్టీ, ఎస్సీ, ఓబీసీ మోర్చా నేతలను అంబర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నేతలను బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ నేతలు నాగభూషణం చారి, డాక్టర్ సమతా, మైలారం రాజు, వెంకటేష్ గౌడ్, సీహెచ్ కృష్ణ, రాజు నేత, వాసు, రాజీవ్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై మాస్‌లైన్ పోరుబాట



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ముషీరాబాద్: ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పలు ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీపీఐ-ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు కె.సూర్యం, కె.ఎస్.ప్రదీప్, హన్మేష్, స్వరూప తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బస్సు పథకం వల్ల మహిళలు ఎన్నడూ లేని విధంగా అవమానాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొత్త బస్సులను తీసుకురాకపోగా ఉన్న 3వేల బస్సులను రద్దు చేశారని ఆరోపించారు. బస్సుల రద్దు ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిసెంబర్ 4వ తేదీన రాష్ట్రంలోని అన్ని బస్సు డిపోల ఎదుట ధర్నాలకు దిగుతామని అన్నారు. 9వ తేదీన హైదరాబాద్‌లోని బస్ భవన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ అలాగే రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల, హాస్టళ్లలో కలుషిత ఆహారంతో విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 80మందికి పైగా మరణించారని పేర్కొన్నారు. దీనిపై జ్యుడీషియరి కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వివిధ విద్యార్థి సంఘాలు ఈనెల 30వ తేదీన ఇచ్చిన బంద్‌కు మాస్‌లైన్ మద్దతు తెలుపుతోందన్నారు. అలాగే 2021లో ఫైనల్ అయిన రెండు జీవోలను యథావిధిగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 7వ తేదీన ఆటో అండ్ మోటార్ బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో నిమ్స్ ఆసుపత్రిలో ప్రభుత్వ మెడికల్ షాపులు ఏర్పాటు చేయాలన్నారు. జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటు చేసి ఆసుపత్రి ఆవరణ నుంచి ప్రైవేటు మెడికల్ షాపులను తీసి వేయాలనే డిమాండ్‌తో డిసెంబర్ 4వ తేదీన ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను అడ్డుకునే కుట్రలను సహించేదిలేదు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య

అంబర్‌పేట: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ కొన్ని స్వార్థపూరిత శక్తులు చేస్తూన్న చర్యల పట్ల ఎస్సీ ఉపకులాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య తెలిపారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ డిసెంబర్ 1వ తేదీన పేరేడ్ గ్రౌండ్‌లో మాలాల సింహగర్జన పేరుతో నిర్వహిస్తున్న బహిరంగసభకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అనుమతులు వచ్చేలా కృషి చేశారని మేడి పాపయ్య ఆరోపించారు. ఒక వైపు ఎస్సీ వర్గీకరణకు మద్దతు అంటూనే మాలాల బహిరంగ సభకు పేరేడ్ గ్రౌండ్ వచ్చేలా కిషన్‌రెడ్డి తోడ్పాటును అందించారన్నారు. ఇలాంటి చర్యలు మాదిగలను మోసం చేయడమేనని అన్నారు. శుక్రవారం అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్స్ పూలిజాల గెల్వయ్య, పల్లెటి లక్ష్మణ్, రాష్ట్ర యువసేన అధ్యక్షులు మంచాల యాదగిరి, పొలిట్‌బ్యూరో సభ్యులు గంట సుదర్శన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు బీమ్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు బొల్లం జ్యోతిలతో కలిసి ఆయన మాట్లాడారు. మాలాల సింహగర్జనకు మాదిగల ఉపకులాల ప్రజలు హాజరు కావద్దని వారు పిలుపునిచ్చారు. 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి సుప్రీం కోర్టు అనుకుల తీర్పు ఇచ్చిందని దానిని ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు జీడీ నర్సింహ, బోడ రవికిరణ తదితరులు పాల్గోన్నారు.



పదేళ్లలో అభివృద్ధి జరిగితే.. ఏడాదిలో నాశనం జరిగింది.!

- బీఆర్ఎస్-ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీడీ అనిల్
- కేసీఆర్ దీక్షా దివస్‌తో చరిత్ర సృష్టించారని వ్యాఖ్య



నల్లకుంట: దీక్షా దివస్‌తో కేసీఆర్ చరిత్ర సృష్టిస్తే.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ చరిత్రను భ్రష్టు పట్టిస్తున్నారని బీఆర్ఎస్-ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీడీ అనిల్ మండిపడ్డారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం ఓయూ ఎన్‌సీసీ గేట్ వద్ద ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిదంటే కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్షే కారణమని ఆయన పేర్కొన్నారు. పదేళ్లలో అన్ని రంగాలలోనూ అభివృద్ధి చేస్తే రేవంత్ సర్కార్ అనతి కాలంలోనే నాశనం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మరణిస్తుంటే రేవంత్ సర్కార్ విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి ఏడాదైనా సంక్షేమ హాస్టళ్ల నిర్వహణకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో వసతి గృహాల్లో నాణ్యమైన భోజనాన్ని అందిస్తామన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు పురుగుల అన్నం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు విడుదల చేయకుండా విద్యార్థులను మానసికంగా దెబ్బతీస్తున్నారని విమర్శించారు. రేవంత్ సర్కారు వెంటనే స్పందించిన రూ.5000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం స్పందించి వారి కుటుంబాలను న్యాయం చేయాలన్నారు. ఆ ఘటనకు కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రాష్ట్రంలో విద్యారంగంపై సమీక్ష జరపాలి

- ఫుడ్‌పాయిజన్ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- నేటి రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల మరణాలపై ముఖ్యమంత్రి తక్షణమే సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. రాష్ట్రంలో వరుస ఘటనలు జరిగిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ తదితర వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించే రాష్ట బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

◆ ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజులు మాట్లాడుతూ... ఫుడ్ పాయిజన్ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనానికి అధిక నిధులు కేటాయించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. గురుకులాలు కేజీ, బీవీలపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి మెనూ అమలు చేయాలని వారు కోరారు. ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు.



విద్యాసంస్థల బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు

◆ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, అశోక్‌రెడ్డి, జె.రమేష్, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నరేష్, పీడీఎస్‌యూ ఉపాధ్యక్షులు ఎం.నవీన్ పాల్గొన్నారు.

'ఖజానా ఖాళీ చేయడానికే ఒకటయ్యారు'

హెబ్రోన్ చర్చి సొసైటీ ఛైర్మన్ కురియన్

చిక్కడపల్లి: నిన్నటి వరకు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకున్న ఎఫ్‌సీఎస్ పీటర్, రాగి వీరాచారి మళ్లీ కలవడంలో ఆంతర్యం ఏమిటని హెబ్రోన్ చర్చి సొసైటీ చైర్మన్ కురియన్ ప్రశ్నించారు? శుక్రవారం రాత్రి గోల్కొండ చైరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరోసారి సంఘాన్ని అప్రతిష్టపాలు చేయడానికి, ఖజానాను ఖాళీ చేయడానికి ఇద్దరు ఒకటయ్యారని విమర్శించారు. బ్రదర్ భక్తసింగ్ ఏర్పాటు చేసిన ట్రస్టుకు ప్రస్తుతం వీరికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. వీరికి ఇందులో స్థానం లేదని ఉన్నారు. ఢిల్లీకి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ వింగ్ అనిల్ థామస్ అనే వ్యక్తి ఈ చర్చిలో వ్యవహారంలో తలదూర్చి పావులు కదుపుతున్నారని, అందులో ఎఫ్‌సీఎస్ పీటర్ పావుగా మారారని ఆరోపించారు.

'కేటీఆర్, కవిత బీసీలపై కొత్త డ్రామాలకు తెరలేపారు'

బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు భూపేష్‌సాగర్



కాచిగూడ: బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని.. వీరు కొత్త డ్రామాలకు తెరలేపారని బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు భూపేష్ సాగర్ అన్నారు. శుక్రవారం కాచిగూడలో బీసీ నేతలు సి.రాజేందర్, టి.రాజ్‌కుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై కల్వకుంట్ల కవితకు మాట్లాడే అర్హత, నైతిక హక్కు లేదన్నారు. స్కామ్‌లు బయటపడుతాయని కేటీఆర్ బీసీలపైన గురుకులాల బాట అని కొత్త డ్రామాలకు తీశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గించింది కేసీఆర్ కదా అని ప్రశ్నించారు. కుల గణనపై ఇప్పటి వరకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించలేదన్నారు.

◆ 2014లో తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే వివరాలు ఇంతవరకు ఎందుకు బయట పెట్టలేదని ప్రశ్నించారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ అధ్యక్షుడిగా బీసీలకు అవకాశం ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బీసీ సంక్షేమ శాఖను అగ్రకులాలలకు అప్పజెప్పిన ఘనత వారిదేనని పేర్కొన్నారు. 90 శాతం మంది గ్రామీణ ప్రాంత ప్రజలు సమగ్ర కులగణనలో ఇప్పటికే పాల్గొనడం చాలా అభినందనీయమన్నారు. పట్టణ ప్రాంతాలలో ముఖ్యంగా హైదరాబాద్‌లో రిజర్వేషన్ వ్యతిరేకులు, కులగణన వ్యతిరేకులు కులగణనకు సహకరించకుండా ఎన్యుమూరేటర్లను అడ్డుకోవడం చాలా దారుణమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తున్న వారిని ప్రభుత్వం తక్షణమే గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం

నల్లకుంట: న్యూనల్లకుంటలోని శ్రీ సీతారాంజనేయ సరస్వతి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివుడికి అభిషేకం కావించారు. అనంతరం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏక రుద్రాభిషేకం కావించి భక్తులకు తీర్థప్రసాద వితరణ కావించారు. అలాగే సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అర్చక స్వాములు, పురోహితుల మంత్రోచ్చరణల నడుమ శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు కల్యాణం విందు అన్న ప్రసాద వితరణ కావించారు. ఈ వేడుకల్లో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు, ధర్మకర్తలు ఎస్.వెంకటేశ్వరరావు, మధుకుమార్, వై.మురళి మధుసూదన్, మురళీకృష్ణ, మంజులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వరస్వామి కల్యాణం

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని అంజనేయస్వామి దేవాలయం, ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ఉమామహేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా కార్తీక బహుళ త్రయోదశిని పురస్కరించుకొని మాస శివరాత్రి భస్మార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏకవార రుద్రాభిషేకం, మహన్యాస రుద్రాభిషేకం, ఆకాశదీపం పూజ, కార్తీక ప్రవచనం, దీపారాధన, ప్రదోష పూజ, బిల్వార్చన, నివేదన, హారతి, మహా మంత్రపుష్పం, తీర్థ ప్రసాదవితరణ చేశారు. అనంతరం కల్యాణంలో గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ దంపతులు, ఆలయ ఈవోలు ఎం.దేవనాథం, పి.లక్ష్మారెడ్డి, అర్చకులు బుగ్గలక్ష్మీపతిశర్మ, కందాల వెంకటాద్రి, ఇ.కాశీనాథశర్మ, భువనందశర్మ పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన కల్యాణంలో భక్తులు



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీమాస ఆకాశదీప పూజ